

(గత సంచిక తరువాయి)

మరి కాసేపటికి వాసు "అక్కా-అక్కా-" అంటూ పరుగెత్తుకుని వచ్చాడు. రాగానే సంచీ అవతలవేసి నా దగ్గరకు వచ్చి "నాల్గున్నరకు స్కూ-లొదిలినా గేమ్స్ వున్నాయక్కా-. రావటానికి వీల్లేక పోయింది. అన్నయ్యా ఇప్పుడే దార్లో కన బడి త్వరగా ఇంటికి వెళ్ళమన్నాడు. పరుగెత్తుకుని వచ్చాను. అమ్మ ఎక్క-డికి వెళ్ళిందక్కా-?" అన్నాడు. బజారు వెళ్ళిందనీ, త్వరగానే వస్తుందనీ చెబుతూ, నేను వాసుకు టిఫినూ, పాలు ఇచ్చాను. అంతలోనే సావిత్రమ్మగారు వచ్చారు. "అబ్బ తిరిగి తిరిగి కాళ్ళు పడిపోయినాయి. ఈ రాజేశ్వరమ్మగార్తో ఎప్పుడూ యింతే. ఒక పట్టాన ఏదీ నచ్చదూ, మెచ్చదూ. ఒక చీర కోసం వూరంతా తిప్పిందెక్క-డో. అన్నట్టు వీడేం యిప్పుడు టిఫిను చేస్తున్నాడు? మాధవం ఇంకా రాలేదూ?" అంటూ నా వైపు చూశారు. నేను వాసు తిన్న ఖాళీ ప్లేటు కడగటానికి తీసుకెళ్తూ అన్నాను. "వచ్చారు టిఫిన్‌తిని షికారు కెళ్ళారు. వాసుకేవో గేమ్స్ వున్నాయట. ఇప్పుడే వచ్చాడు" ఆమె ఇకనేం పలక లేదు.

ఆ రాత్రి భోజనాలు ముగిసి పడుకోబోతూ సావిత్రమ్మగారు మంచమ్మీద కూచుని నన్ను కేకవేశారు. "చూడమ్మా లక్ష్మి కాస్త ఆముదపు సీసా తీసుకునిరా. ఆ ఎండకు తిరిగి కాళ్ళాకటే నొప్పులు, మంటలు" పక్క- కుర్చీలో కూచున్న మాధవరావుఅన్నాడు. "కాకున్నా చెప్పులు తొడుక్కో-మంటే వినవమ్మా నీవు మరీనూ." "ఏమిటో నా కలవాటులేదురా. అసలు చెప్పులు తొడుక్కు-ని నడవలేను కూడానూ" అంటూనే ఆమె ఒక కాగితపు పొట్లంతెచ్చి వూడదీశారు. గులాబీరంగు చీర, చుట్టూ నల్లని పెద్దఅంచూ, అంచు నిండా చక్క-ని జల్తారు డిజైను, పమిట కొంగున మూరెడు నల్లంచు, జల్తారు పువ్వుల్లో మిలమిల మెరుస్తున్నది చీర. చూడగానే నచ్చింది నాకు. "ఏమిటో ఈ చీర చూడగానే నచ్చిందిరా నాకు. వదల బుద్ధి కాక కొనుక్కు-ని వచ్చాను. బాగుందట్రా అబ్బాయ్?" అన్నారు. "సరే యిది మరీ బాగుంది. చీరల బేరం, నాణ్యం నాకేం తెలుసమ్మా? కాకున్నా అసలిది ఎవరికని తెచ్చావు?" అన్నాడు. "ఆ ఎవరికేమిట్రా? ఇంకో నాల్గురోజుల్లో స్వర్ణ వస్తానని రాసిందిగా? దానికోసమనే తెచ్చాను. ఎట్లావుందో చెప్పు?" అన్నారు. "నా మటుకు నాకు నచ్చితే సరా? దానికి నచ్చవద్దూ? అదన్నీ నైలెక్స్. పెళ్లిన్లూ కష్టేదిగదా? ఈనూలుచీర మెచ్చుతుందా?"

"ఆ మెచ్చకపోతే పోనీ! కోడలికిస్తానంతేగదా" అంటూ సావిత్రమ్మగారు అంతవరకూ బొమ్మలా నిల్చుని వాండ్ల మాటలు వింటున్న నా వైపు తిరిగారు. "చూడమ్మా లక్ష్మి చీర బాగాలేదూ? అంచూ, కొంగూ అందంగా లేవూ?" చాలా బాగున్నాయమ్మా. నిజంగా ఎంత అందంగా వున్నాయో చెప్పలేనసలు." సావిత్రమ్మగారు చిరునవునవ్వి కొడుకువైపు చూశారు. మాధవరావు మొహం క్షణంసేపు ఎర్రబడిందెందుకో. "బాగుంది సరసం" అంటూ అతను లేచి మేడ మీదకు వెళ్ళిపోయాడు. నాకేం అర్థంగాక సావిత్రమ్మగారివైపు చూశాను. ఆమె నవ్వుతూ చూశారు నా వైపు.

సాధారణంగా పడుకోబోయే ముందు ఎప్పుడన్నా అరికాళ్ళు మంటలని ఆముదం రాసుకొని పడుకోవటం అలవాటు సావిత్రమ్మగారికి. ఆ రోజూ అట్లాగే రాసుకుంటున్నారు. వాసు చదువు ముగిసి గుర్రుపెడుతున్నాడు. మంచినీళ్ళ చెంబు టేబులు మీద పెట్టి, పెద్దలైటు తీసి, చిన్న లైటు వెలిగించాను నేను. ఇంతలో మేడ మీద నుంచి "అమ్మా. వాసు మేల్కొ-నివుంటే కాసిని మంచినీళ్ళు పంపించు" అని కేక వేశాడు మాధవరావు. సావిత్రమ్మగారన్నారు "వాడు నిద్రబోతున్నాడ్రా. నా కాళ్ళకాముదం రాసుకుంటున్నాను. నీవే వచ్చి కాసిని తాగి వెళ్ళరాదట్రా అబ్బాయ్" "సరేలే. అంత దాహం కావటం లేదు. ఇప్పుడక్క-ర్లేదులే" అన్న కొడుకు మాటలకు విసుక్కు-న్నారు సావిత్రమ్మగారు.

"అక్క-ర్లేదేమిటీ, తిక్క-లవాడివెక్క-డో ఒక తట్టు దాహమంటూ, నీళ్ళు వద్దంటావేం బద్ధకంరా?" అన్నారామె. మాధవరావు పలకలేదు.

ఇక తప్పదన్నట్టు మంచినీళ్ళ చెంబూ, గ్లాసు తీసుకుని మేడమీదకు వెళ్ళాన్నేను. గదిలో ఎవరూలేరు. చెంబు బల్లమిద వుంచి వెనుతిరిగాను. నా వెనకనే నిల్చుని వున్నాడు మాధవరావు. మౌనంగా నడిచాను నేను. రెండడుగులు వేశానో లేదో మెల్లని స్వరంతో "లక్ష్మి" అని పిలిచాడతను.

ఇన్నాళ్ళనుంచీ ఇక్క-డున్నా మాధవరావేనాడూ నన్ను పేరుతో పిలవలేదు. అంత అవసరమూ రాలేదు. ఈనాడతని నోటి నుంచి నా పేరు వింటుంటే నాకే ఏమిటో మత్తుగా, చిత్రంగా అనిపించిందా మాట. నేను వెనుదిరిగి చూడలేదుగాని నిల్చున్నాను. అతను తిరిగి అన్నాడు "నీతో కాస్త మాట్లాడాలి." ఈ సారీ నేను అతనివైపు తిరగలేదుగాని "చెప్పండి" అన్నాను. అతను నా దగ్గరకొచ్చి నా చెయ్యి అందుకున్నాడు. "అట్లా నిలబడి

# ఛేటింగ్

'కనకవల్లి'

వినేమాట కాదు. కాసేపు స్థిమితంగా కూచుని విని వెళ్ళవుగాని రా" నేను సున్నితంగానే అతని చెయ్యి విడిపించుకున్నాను. మెల్లగానే "నేను స్థిమితంగానే వింటున్నానులెండి చెప్పండి" అన్నాను.

నా మెత్తదనం అతనికొక్కా స్త అలుసుగా కనిపించి వుండి వుంటుంది. మరి కొస్త చనువు తీసుకున్నాడు. నా రెండు భుజాలమీదా చేతులువేసి, నన్ను తనవైపు తిప్పుకోను ప్రయత్నం చేశాడు. "అహ అట్లా అంటే లాభంలేదు మరి. నే నొక రహస్యం చెప్పాలి నీకు" అన్నాడు. అతని చనువుకు కోపంవచ్చింది నాకు. ఏమిటితని చొరవ? ఇతనెంతో మంచివాడనుకొన్నానింకా. ఆ మాట అనుకుని గట్టిగా ఇరవై నాలుగ్గంటలు కాలేదు. ఇతని అసలు స్వరూపం బయటపడింది. మంచి పనయింది. కోపాన్నదుపులోకి తెచ్చుకుంటూ దూరంగా జరగను ప్రయత్నించాను. అతను నన్ను వదల్లేదు. నాకు మరింత ఉక్రోష మొచ్చింది. "వదలండి ముందు. మీకూ నాకూ మధ్య రహస్యాలేమున్నాయని చెప్పటానికి?" అన్నాన్నేను. అయినా అతను నన్ను వదల్లేడు. మరింత దగ్గరకు తీసుకోను ప్రయత్నిస్తూ "అబ్బా! అంత త్వరపడతావేం లక్ష్మీ? అసలు సంగతి చెబుతా రా" అన్నాడు. అంతే నా కోపం హద్దుమీరిపోయింది. మరుక్షణమే నేను గిరుక్కున వెనుదిరగటం అతని చెంప ఛెళ్ళుమనిపించటం జరిగాయి. మాధవరావు నిర్ఘాంతపడి చూస్తూ నన్ను వదిలి చెంప పట్టుకుని "లక్ష్మీ!" అన్నాడు నేను అతని వైపొకసారి చూసి మెల్లగా అన్నాను. "ఇంకెప్పుడూ ఇట్లాంటి పిచ్చి పనులు చెయ్యకండి. పేదవాండ్లందరూ డబ్బు అంటే చాలు ఏ పనికైనా సిద్ధంగా వుంటారనీ, ఇంత డబ్బు పారవేసి వాండ్లనెట్లాగంటే అట్లా ఆడించవచ్చుననీ డబ్బున్న వాళ్ళందరికీ వున్న దురూహే మీకూ వున్నట్టుంది. దిక్కులేని దాన్నయినా నాకూ గౌరవమర్యాద లున్నాయి. గౌరవంగా బతకాలనే ఆశ వున్నది. నేను బతుకుతెరువుకోసం మీ ఇంటికి వచ్చి మిమ్మల్నాశ్రయించిన మాట నిజమే గాని, మిమ్మల్ను వలలో వేసుకుని మీ ద్వారా డబ్బు సంపాదించవలెనని చూడటంలేదు" అతను మాట్లాడకముందే కిందకు వచ్చేశాను.

ఇది జరిగిన తరువాత ఇకనాకాయింట్లో వుండను మనసు కాలేదు. మాధవరావు అంతర్యమేమిటో తెలిసిపోయింది. ఇక అతన్ని నమ్మటం శుద్ధ బుద్ధితక్కువ. అతను సమయంకోసం కాచుక్కూచున్నాడంతే. ఒకవేళ ఉన్నట్టుఒక వేళ ఉండదు. సావిత్రమ్మగారెంత మంచిదైనా కొడుక్కంటే ఆమెకు వేనెక్కువదాన్ని కాలేనుగా? ఇక నా దారి వెతుక్కుంటేనే మంచిదనుకున్నాను. సావిత్రమ్మ గారికి చెప్పి మెల్లిగా తిరిగి శరణాలయం వెళ్ళటమే ప్రస్తుతం నాకు క్షేమమనిపించింది.

ఈ నిశ్చయానికి నేను వచ్చిన మర్నాడే మాధవరావు చెల్లెలు స్వర్ణలత వచ్చింది. ఆ అమ్మాయికి పెండ్లయి ఏడాది కావస్తున్నది. పది నెల్లకు పైనయిందట కాపరానికి వెళ్ళి. అత్తగారింటికి వెళ్ళిన తరువాత పుట్టింటికి రావటం ఇదే మొదటి సారట. రాగానే నా దగ్గరకువచ్చి నన్ను ఎగాదిగా చూసి, నవ్వి "ఇకనేం? బంగారుబొమ్మలా గున్నావు. అందుకే అన్నయ్య అంతగా ఇష్టపడ్డాడు. ఒరే అన్నయ్యా! నీ సెలెక్షన్ బాగానే వుందిరోయ్. చాలా బాగుంది" అంటూ మాధవరావు వైపుతిరిగి నవ్వి, మళ్ళీ నా వైపు తిరిగింది. "ఊ. నీ పేరేమిటోయ్? సూర్యలక్ష్మి? మంచిపేరే. అంతకంటే రాధ అంటే మరీ బాగుండదట్రా అన్నయ్యా? సరే, ఏదో ఒకట్లే. ఇక మీదట మనిద్దరం జట్టు. ఏం?" అన్నది. ఆమె మాటల కర్థం తెలియక తెల్లబోయి చూశాన్నేను. మాధవరావు కొస్త ఇబ్బందిగా కదలి "అబ్బ వూరుకోవే బంగారు తల్లీ! మొదలుపెట్టావు వాగుడు" అన్నాడు చెల్లెల్తో.

స్వర్ణలత పోలిక తల్లిదికాదు గాని, బుద్ధిఅంతా తల్లిదే. అయిదు నిముషాలకే అయిదేండ్లనుంచీ పరిచయమైన దానిలా మాట్లాడ నారంభించింది నాతో. తల్లితో, అన్నతో. తమ్ముడితో క్షణం తీరికలేకుండా మొదలుపెట్టింది సంభాషణ. సాయంకాలం కాగానే నాతిపూలన్నీకోసి వచ్చాం తీసుకుని వెళ్ళి స్వర్ణలత కిద్దాము. సావిత్రమ్మగారు వంట యింట్లో వున్నారు. మాధవరావు షికారుకూ. వాసు ఆటలకూ వెళ్ళారు. ఇక ఇప్పుడేమంత పనిలేదునాకు. స్వర్ణలత మాల అల్లుతుంటే పువ్వులందిస్తున్నాను నేను. మాల అల్లుతూనే స్వర్ణలత అందుకున్నది. "ముహూర్త మెప్పుడనుకుంటున్నారోయ్ రాధా? అహ సూర్యలక్ష్మి. చిక్కొచ్చింది నీ పేరుతో. నేను రాధా అనే పిలుస్తాను సుమా నిన్నికమీద ఏమీ అనుకోవద్దు"

"ఏమీ అనుకోను. మీ కిష్టమైనట్లు పిలవండి" అన్నాన్నేను తల వంచుకుని.

స్వర్ణలత నా తలపైన చిన్నగా మొట్టి నవ్వింది. "నేన్నిన్ను చనువుగా రాధా అని పిలుస్తుంటే నీవు నన్ను స్వర్ణా అని పిలవక అండీ ఏమిటే? అండీ తప్పేలా మా" అన్నది. "నాకు మిమ్మల్ని నీవూ అనటం బాగుండదు. కావాలంటే స్వర్ణలతగారూ అనమంటారా?" అన్నాను బిడియపడుతూ. "మంచిదానివి. మళ్ళీ గారూ ఎందుకూ? గారె, అరిసేనూ, వట్టి స్వర్ణలతా అను. లేకుంటే నాకోపమొస్తుంది" నేను నవ్వి వూరుకున్నాను. ఆమె మళ్ళీ అన్నది. "సరే ఇంతకూ అసలుమాట బయటకు రానియ్యవేం? ముహూర్త మెప్పుడు?"

"ఏ ముహూర్తం? నాకేం తెలుసూ?" అన్నాన్నేను తెల్లబోతూ. స్వర్ణలత నావైపు ఓరగా చూసి చిన్నగా నవ్వింది. "సరే ముహూర్తం సంగతి తర్వాత చూద్దాం. ముందు ఇది చెప్పు. పెండ్లికొడుకు నీకు వచ్చి నట్టేనా?" అంటుంటే నేను మరింత తెల్లబోయాను. దాంతో నాకు పొద్దుట్నుంచీ ఆమె అన్న మాటలన్నీ గుర్తుకొచ్చాయి. [illegible] మాటలకు అర్థం? "మీరనేదేమిటో నా కర్థంకావటం లేదు. తెచ్చిన [illegible] మీకిదే తొందరలో హ[illegible]

డా॥ పి. వి. కె. రావ్, B. A.
వైద్యవిద్వాన్ - వైద్యాచార్య. (సెక్సాలజిస్టు)

వివాహము వాయిదా వేయ నవసరం లేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనములకు ఆయుర్వేద చికిత్స.
పోస్టు ద్వారా చికిత్స కలదు.
రావూస్ క్లినిక్
టి. బి. రోడ్. తెనాలి, ఫోన్ : 700.

SUVARNA

వాదండి ముఖ్యంగా అలక్ష్యమైన. క్రమముగాకాక పోయిన బాధతో కూడిన. లేక ఆగిపోయినబహిష్టుకు
SEALED PACKING OF 14 TABLETS
AVAILABLE AT ALL CHEMISTS
Mfrs: SEENU & CO., MADRAS-21

తెల్ల మచ్చలు
మా స్వస్తికా బూటి తెల్లమచ్చ రంగు సమూలంగా త్వరితగతిని మామూలుగా మార్చును. 2 నెలలకు ఒక సీసా ఉచితంగా ఇవ్వబడును.
తెల్ల వెంట్రుకలుండవు
పొగడడం మాకు ఇష్టంలేదు. కాని మా 'కేష్‌రంజన్' ఆయుర్వేదిక్ పేంటెడ్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగా మార్చును. మొదట తెల్ల వెంట్రుకలను నల్లవిగా మార్చి. ఆటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపు వృద్ధి పరచును. లాభం పొందినవారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు. లాభం లేకున్న డబ్బు వాపసు. ధర రు. 12/-.
SHYAM AYURVED BHAVAN (3-5)
P. O. Katri Sarai (Gaya)

నా కొకటీ అర్థం కావడంలేదు." అన్నాను బిక్కమొగమేసి. స్వర్ణలత నావైపుకా సేపు చూసి ముసిముసిగా నవ్వింది. "అయితే నీకు అమ్మా అన్నయ్యా ఏమీ చెప్పలేదన్నమాట?" నాతో ఏమీ చెప్పలేదని తల అడ్డంగా వూపాను.

"సరే అయితే విను, నేను చెబుతాను. మా అమ్మ అని నేననకూడదుగాని రాధా. మా అమ్మ నిజంగా దేవతనుకో. ఆమె పుట్టింది కలిగిన చోటేగాని, అత్త వారంత వున్నవారుకాదు. మా నాన్నగారికా చదువొక్కటే ఆధారం. ఆమె అత్తగారింట్లో చాలా యిబ్బందులు పడిందట. మొట్టమొదట నాన్నగారి జీతం నూర్రూపాయలు మాత్రమే. మెడ్రాసులో కాపరం. రేషను రోజులు- అవసరమైతే పంపటానికి ఎటువైపు పెదవారూ పూనుకోకపోగా. ఇంకా తమకు పంపటంలేదనీ. చదువు చెప్పించి ఇంత వాణ్ని చేస్తే భార్యా విధేయుడై తమ మాటే అనుకోడని తాతయ్యా, నాన్నమ్మా నిష్ఠురాలు. నిజానికి వారికేం దరిద్రంలేదు. నాన్న జీతం ఆశించేంత హీనస్థితిలో లేరు. కాని కొడుకు సంపాదన కొడుకూ, కోడలూ ఇద్దరే తినటం వారి అభిమతం కాదు.

అమ్మకు పసితనమే అయినా సమర్థత ఉన్నది. అంతేకాదు ఎంత మంచిదో, నిరాడంబరురాలో అంత పట్టుదలగల మనిషి కూడనూ. మంచమున్నంతవరకే కాళ్ళు జాచుకోగలదామె. ఆ రోజులన్నీ జరిగిపోయినాయి. ఆమె అదృష్టమో. ఎవరదృష్టమో నాన్నగారీనాడు పదిహేను వందల జీతమ్మీద పనిచేస్తున్నారు. ఈ ఆస్తంతా ఆయన చేతిమీదుగా సంపాదించినదే. కాని అమ్మను చూచావుగదూ? ఆ నేత చీరలు తప్ప మరొకటి కట్టుకోదు. అమ్మది జాలి గుండె. చాతనైనంత వరకు ఒకరికివ్వటమేగాని, తీసుకోవటం ఎరగదామె. అన్నయ్య చదువై వుద్యోగంలో చేరగానే బోలెడంత కట్నాలుపోసి పిల్లనివ్వను ఎందరో వచ్చారు. అయినా అమ్మ ఉద్దేశ్యాలు వేరు. అన్ని రకాల అర్హతలు వుండికూడా కేవలం కట్నాలు పొయ్యలేని కారణంగా ఎందరో పిల్లలకు పెండ్లిండ్లు కావటంలేదు. ఏ బీదయింటి పిల్లనో కోడలిగా తెచ్చుకోవాలని ఆమె అభిలాష.

అన్నయ్య ఆమె బుద్ధులు పుణికి పుచ్చుకున్నాడు. బీదవారికూడా తన వారనే మనుష్యులు. సంఘంలో ఒక స్థానమూ అన్నీ వుంటాయిగదా, అవిలేక ఆదరించేవారులేక అల్లాడే కన్యను చేపట్టాలని వాడి సంకల్పం. చెప్పొద్దూ. మా అమ్మ ముందుకాస్త తటపటాయించింది. మరీ కులం, మతం లేకుండా శరణాలయంలో పెరిగిన పిల్లనా అని అన్నది కాని, చెప్పానుగా, ఆమె మూర్ఖురాలు కాదు. చెపితే అర్థం చేసుకోగల మనిషి. మంచి ఎక్కడున్నా స్వీకరించను ఆమె కభ్యంతరం లేదు. అదీ కథ. నీ సంగతంతా నాకు జాబుల ద్వారా తెలుస్తూనే వున్నది. నిన్నీ యింటి కోడలుగా సెలెక్టు చేసుకుని తెచ్చుకున్నారిద్దరూ."

నేను తెల్లబోయి చూశా ఒక క్షణం. "అదేమిటీ? మీ అన్నయ్యకు పెండ్లయిందనీ. భార్య పురిటికి పుట్టింటికి వెళ్ళిందనీ చెప్పారే మరీ?"


స్వర్ణలత విరగబడి నవ్వింది. "అని చెప్పారా నీతో? భలేమాటే- అన్నయ్యకింకా పెండ్లి కాలేదు. నీవు ఒప్పుకుంటే ఈ నెల్లోనే పెండ్లి. అన్నట్టు నీకింకా ఇది తెలియదుగదా? నాన్నగార్ని ఇటువైపులకే ట్రాన్స్‌ఫర్ చేశారట. పది పదిహేను రోజుల్లో వస్తానని రాశారట. ఆయన వస్తే మరొక నెల రోజుల్లో పెండ్లి. ఆ తర్వాత నీవు కాస్త శ్రమ తీసుకుంటే వచ్చే ఏడాదికి కొడుకూనూ" అని నవ్వింది. నా మొహం ఎర్రబడింది. ఏమనాలో. ఏం చెయ్యాలో కూడా తోచక అట్లాగే తల వంచుకూచున్నాను. స్వర్ణలత మాలకట్టి సగం తుంపి నా తలలో తురిమి నా గడ్డం పట్టుకుని ముఖం పైకెత్తి చూస్తూ నవ్వింది. "అరెరె ఇదంతా సిగ్గేనా ఏమిటి? అబ్బ సిగ్గు పడుతుంటే నీ ముఖం మరీ అందంగా వున్నదోయ్. అద్దం తెచ్చి చూపమంటావా? అన్నయ్యను పిలవమంటావా?" అంటుంటే నేనామె చెయ్యి విడిపించుకుని కిందకు పరుగెత్తాను. మెట్లు దిగుతున్నా ఆమె నవ్వు వినబడుతూనే వుంది.

ఆ రాత్రి నాకు అన్నం తినబుద్ధికాలేదు. నిద్ర పట్టలేదు. అందర్తో అన్నానికి రమ్మని సావిత్రమ్మగారు పిలిచారు. కాని నా కాకలి కాలేదని తప్పించుకున్నాను. స్వర్ణలత నవ్వింది. "పెండ్లి మాట వినగానే కడుపు నిండిపోయిందేమో పాపం!"

"వూరుకోవే. నువ్వు మరీనూ. లక్ష్మికసలే సిగ్గు. నీవు మరీ పెంకెదానివి. నిన్ను చూస్తేభయం. నాతోతింటుందిలే' 'కాకున్నా దీనికి వాగుడు జాస్తి. ఈ వాగుడు భరిస్తున్నందుకు బావగార్ని మెచ్చుకోవచ్చు ననుకుంటాను కదమ్మా?" "అమ్మో! అంతలోనే యిద్దర్నీ కొంగున కట్టేసుకున్నావు. ఏమ్మంత్రం పెట్టావమ్మో నంగనాచీ?" స్వర్ణలత ఆశ్చర్యం ప్రకటించింది. నిజంగా నాకేమీ ఆకలి కాలేదు. ఏమిటో

అంతా తికమకగా వున్నది. కొత్త మజ్జిగన్న మయినా తినందే సావిత్రమ్మగారు వదల్లేదు. మరీ బతిమాలించుకోవటం ఇష్టంలేక కొంచెం మజ్జిగ అన్నంతిన్నాను. హాల్లో సావిత్రమ్మగారూ, స్వర్ణలతా ఏదో సంసారపు గొడవలు చెప్పుకుంటున్నారు. నేను అన్నంతిని అంతాసర్ది, వంటిల్లుకడిగి, దొడ్లో తులిసెమ్మ దగ్గరకు వచ్చాను. తులసికోట పక్కగా మాధవరావు నిల్చున్నాడు. నేను అతన్ని గమనించనట్టుగానే ఇవతలకు రాబోతుండగా అతను "నీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలని నిల్చున్నా నిక్కడ. నీవొకసారి మేడ మీదకు రాగలవా లక్ష్మీ?" అన్నాడు. నేను ముభావంగానే అన్నాను, "మీరేదైనా






మాట్లాడాలంటే ఇక్కడే మాట్లాడండి. నేను మేడమీదకూ, మిద్దెమీదకూ రాను."

అతనొక క్షణం తటపటాయించి "సరే అట్లాగే కానివ్వు. మేడమీదనైతే శాపీగా మాట్లాడవచ్చును. ఎవరూ రారుగదా అని అన్నానంతే. పోనీ నీ కిష్టం లేకుంటే ఇక్కడే మాట్లాడుతాను. ఈ విషయంలో నీ అభిప్రాయమేమిటో చెప్పు" అన్నాడు. "ఏ విషయంలో?" అన్నా నతనివైపు చూడకుండానే. నా మాటలకతను నవ్వాడు. నేను ఆశ్చర్యంగా చూశానతన్ని "అంతా తెలిసీ ఎందుకట్లా అమాయకత్వం నటిస్తావు? ఈ విషయంలోనే- పెండ్లి విషయంలోనే నీ అభిప్రాయ మేమిటీ అని" ఈ కథంతా తెలిసిన తరువాత నాకూ మనసులో కొన్ని సంశయాలు ముల్లులా బాధిస్తున్నాయి. అవి నివృత్తికానిదే తట్టుకోలేను కూడానూ. అందుకే ఇక నేమీ డొంకతిరుగుడు లేకుండా. అతని ప్రశ్నకు వెంటనే సమాధానమిచ్చాను. "అభిప్రాయానికేమున్నదీ? మీరు చాలా దయార్ద్ర హృదయులూ. సంస్కారవంతులూనూ? ఒప్పుకున్నాగాని, మీరొక బీదపిల్లను పెండ్లి చేసుకుని ఉద్ధరించ దల్చుకున్నప్పుడు ఇంత నాటకమెందుకూ? హాయిగా మొదటే ఆమాట చెప్పొచ్చుగా?" సూటిగా అడిగిన నా ప్రశ్నకు అతను వెంటనే జవాబివ్వలేక కాసేపాగాడు. "ఇందులో సంస్కారమనీ, దయ అనీ పెద్ద పెద్ద మాటలెందుకూ? నాకు కాబోయే భార్య ఎటువంటి చోట పుట్టినా, ఎక్కడ పెరిగినా, మంచి మనసుగలది కావాలని నాయిష్టం. ఆ పిల్ల భావాలు నాకు నచ్చుతాయో లేదో తేల్చుకోవటంకోసమే ఇదంతా జరిగింది. ఇదేం పెద్ద తప్పు పనికాదు?"

"అయితే మీ కాబోయే భార్యకిదో చిన్న పరీక్షన్నమాట. ఇందులో గెలిస్తే మీరు పెండ్లి చేసుకుంటారు. బాగుంది. ఒకవేళ ఓడిపోతే.... అసలింతకూ ఈ పరీక్షలో నేనెన్నోదాన్ని?" నా ప్రశ్నకు మాధవరావు ముసిముసి నవ్వులు నవ్వాడెందుకో. "సరేలే సరసం, ఎన్నోదాన్ని అని అంత పొడుగు దీర్ఘం తియ్యకు ఆటంబాంబు లాగా. నీవొక్కదానివి చాలు నా ప్రాణానికి ప్రథమ చుంబనం. దంత భగ్నమని చెంప పగలగొట్టి మరీ గెల్చికూచున్నావు. ఇంక దమ్ములుండొద్దూ అసలు?" నాకూ చచ్చే నవ్వొచ్చిందా మాటలకు. అయినా అతికష్టమ్మీద నవ్వు దాచుకోగలిగాను. అతని కండ్ల బడితే ఇకనేమున్నదీ? "మీ కెంత సేపూ. మీ ఆశలూ, ఆశయాలూ, కోరికలే గాని అవతలి మనిషి విషయం పట్టదా? మీలాంటి కోరికలు నాకూ వుండొచ్చునుగా?" గంభీరంగా చూస్తూఅడిగానతన్ని. మాధవరావు నా మాటలకు చిరునవ్వు నవ్వాడు." తప్పక. అందుకేగా సెకండ్ షో సినిమాకు వెళ్ళినట్టు నేనీ రాత్రి నిద్ర మానుకుని నీ ముందు పడిగాపులు పడి నిల్చొటం- నీకీ పెండ్లి సమ్మతమా కాదా?" "నాకు మీ స్వభావం నచ్చలేదు" ఠకీమని సమాధానమిచ్చాను. నేననుకున్నట్టు అతనేం తెల్లబోలేదు. మామూలుగానే "ఎందువల్ల?" అన్నాడు. అతని ధోరణికి నాకూ కొంత కొంటెతనం కలిగింది. మెల్లగానే అడిగాను. "కారణాలు కావాలా?" "కావద్దూ మరి? నాలో నీకు నచ్చని అంశమేదో చెబితే, మరో చోట వెతుక్కునే టప్పుడు అది సవరించుకోవచ్చునుగా?" నా మనసు కలుక్కుమన్నది అతని మాటలు విని. అయితే ఇది కాకపోతే మరోచోట వెతుక్కుందామని సిద్ధంగా వున్నాడితను.

"అయితే చెబుతాను వినండి. మీ మనసు మహా అనుమాన భూయిష్టం. ఆడవాండ్ల మీద మీ కేమీ నమ్మకమున్నట్టు లేదు చూస్తుంటే. అందువల్లనే ఈ ఎత్తు ఎత్తారు. ఎంత బీదవారైనా అయినింటి కుటుంబాల వారెవరూ తమ ఆడపిల్లల్ను పెండ్లికాక


## గొప్ప అవకాశం

మొత్తం 62 గల నమూనా

| | | | |
|---|---|---|---|
| 14 | 19 | 12 | 17 |
| 23 | 8 | 21 | 10 |
| 16 | 15 | 18 | 13 |
| 9 | 20 | 11 | 22 |

(ట్రాన్సిస్టర్ల ప్రచారం కొరకు మరియు అమ్మకమునకు చేయు పథకం)

మొదటి బహుమతి; మొత్తం సొల్యూషన్ సరియైనది అయినచో ఒక వెయ్యి నగదు. రెండవ బహుమతి ; పై మూడు అడ్డ వరుసలలో సరియైనది అయినచో అయిదు వందలు నగదు. మూడవ బహుమతి; (200)లేక అందరు ఎంట్రీదారులకు ఎక్కడైన ఏ అంకైన సరియైనది అయినచో సోనీ 3 బ్యాండ్ ఆల్ వరల్డ్ ట్రాన్సిస్టరు ధర : 270/-లో సగం ధర. నిబంధనలు: దిగువ వీయబడినవి జాగ్రత్తగా చూడండి. 1. ఖాళీ కాగితముపై 9 నుండి 24 వరకుగల అంకెలను ఉపయోగించి ఎటు కూడినా మొత్తం 66 వచ్చునట్లు వేయాలి. 2. సీల్డు సొల్యూషన్ మా కార్యాలయమునందుంచబడినది. అది ఎమ్. డి. చే స్వయంగా తెరువబడును. 3. ఈ పోటీకి ఎంట్రీ ఫీజు లేనందువల్ల మొదటి మరియు రెండవ బహుమతులు ఈ సీల్డు సొల్యూషన్‌తో సరిపోయినప్పుడు మాత్రమే ఇవ్వబడును. అట్లు లేని యెడల మొదటి. రెండవ బహుమతులుండవు. 4. మూడవ బహుమతి గెలుపొందిన వారు పోస్టేజి ఖర్చులు మొదలయినవి చెల్లించాలి. 5. మూడవ బహుమతి గెలుపొందినవారికి నగదు బహుమతులుండవు. 6. ఫలితము మరియు స్టేషనరీ కొరకు 45 పైసల స్టాంపులు పంపండి. 7. ఒక ఎంట్రీదారుడు ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. 8. లావాదేవీలు ఆలీఘర్ సివిల్ కోర్టునందు మాత్రమే.

ముగింపు తేదీ : 24-6-77 ఫలితం : 26-6-77

MAYUR TRADERS (AJW-66) Jaiganj, ALIGARH-30.

ముందే మీ ఇంటికి పంపి కొన్నాళ్ళు మీ ట్రయినింగిచ్చి చూసి, నచ్చితే చేసుకుంటాననీ నచ్చకుంటే వాపసు పంపుతానంటే ఒప్పుకోరు. అందుకే శరణాలయం పాలబడ్డారు. తనయందు నమ్మకం లేని వాడ్ని చేసుకుని ఏ ఆడదీ సుఖపడదు" నా మాటలకతను కోపం తెచ్చుకుంటాడేమోననుకున్నానుగాని, అతను మామూలుగానే అన్నాడు. "ఇందులో తప్పేమిటీ? కాబోయే భార్య బుద్ధిమంతురాలు కావాలని కోరని పురుషుడూ, తన భర్త మంచివాడు కావాలని కోరని స్త్రీ వుంటారంటావా? ఇదేదో నేను పెద్ద చెయ్యరాని నేరం చేసినట్టు మాట్లాడుతావేం ఖర్మ!" నేను విసురుగానే అన్నాను- "ఇందులో తప్పేమిటో మీకు కనబడలేదూ? అవున్లెండి. ఎవరి తప్పు వాళ్ళకెట్లా అర్థమవుతుంది? నేను చెబుతాను వినండి. మిఠాయి ముందు పసిపిల్లను కూచోబెట్టి, అది వ్యామోహపడితే తప్పెవరిది?" మాధవరావు మధురంగా నవ్వాడు.

"ఆగాగు కోపంలో మరీ జోరుగా మాట్లాడకు. నీవట్లా మాట్లాడితే నేనొప్పుకోను. పసిపిల్ల అజ్ఞానురాలు. కాని అది వ్యామోహపడి మిఠాయి తిన్నదే అనుకుందాం. మరేం కొంప మునగదు. కాని యుక్తవయస్కులైన ఆడపిల్లలు అట్లా కారుగదా? మంచీ చెడూ ఆలోచించే వయసు నీకు లేదా? ఇక ఆకర్షణలంటావా? లోకం నిండా ఆకర్షణలు కోకొల్లలుగా ఉంటాయి. ఆకర్షణలో పడదోసి మనలను మోసం చెయ్యాలనే కొందరు చూస్తుంటారు కూడాను. మనల్ని మనమే నిగ్రహించుకోవాలి. తన తల్లి తెలిసో తెలియకో చేసిన తప్పుకు తను నా అనే వాళ్ళెవరూ లేక బాధపడే ఒక ఆడపిల్ల. తాను తెలిసి కూడా వ్యామోహపడితే దాన్నేమంటారో నీవే చెప్పు. అది మంచి పనేనా? నాకు పెండ్లయిందని మొదటే చెప్పానుగదా? గుర్తులేదూ? కాకున్నా నీవొక పొరపాటు మాటన్నావు. మిఠాయి. పసిపిల్లా అని. నేను మిఠాయినీకాదు. నీవు పసిపిల్లవూ కాదు నిజానికి." నేనేం పలక్కుండా కూచున్నాను. అతనూ కాసేపు మాట్లాడకుండా కూచుని "అయినాయా నీ ధర్మసందేహాలు?" అన్నాడు.

"అంటే?" అన్నాను అయోమయంగా చూస్తూ. అతను నావైపు కొంటెగా చూస్తూ నవ్వాడు. "అంటేనా? నీకేవో కొన్ని సందేహాలున్నట్టున్నాయి. అవన్నీ తీరితే నేను నీకు నచ్చవచ్చునేమోనని నా ఆశ. అంతే-ఇదేం దురాశ కాదుగదా?" మౌనమర్ధాంగీకారంగా తల వంచుకూర్చున్నాన్నేను. అతనూ కాసేపట్లాగే వుండి మరి కొస్త దగ్గరకు వచ్చి మెల్లగా అన్నాడు.

"అసలిదంతా విదేశాల్లో జరిగే డేటింగ్ పద్ధతిలో జరపదల్చుకున్నాన్నేను. కాబోయే భార్యా భర్తలు కొన్నాళ్ళు కలిసి మెలిసి వుంటే ఒకరి నొకరు అర్ధం చేసుకుని పెండ్లాడితే బాగుంటుందని నా భావన. ముందుగానే పెండ్లి చేసుకుంటానంటే మనకు నచ్చనప్పుడు లేనిపోని ఆశలెందుకు కల్పించటం అనిపించింది. అంతేకాదు. పెండ్లి అనగానే కొంతమంది తమ సహజ స్వభావం కప్పిపుచ్చుకోవచ్చు. అందుకే






"చిరంజీవి రాంబాబు"లో జమున, అల్లు రామలింగయ్య

నాకు పెండ్లయిందనీ, అమ్మకు సాయం కావాలనీ కోరాను. నచ్చనప్పుడు పేచీయే లేదు. మొదట అనుకున్నట్టే కొన్నాళ్ళు కాగానే ఏదో వుద్యోగంచూసి పంపివేయవచ్చు. ఎదటివాడు భార్యా బిడ్డలున్నవాడని తెలిసీ, వాడితో పరిచయం పెంచుకున్న మనిషి నా దృష్టిలో మనో నిగ్రహం లేనిదీ, తమ మధ్య వివాహం అసంభవమని తెలిసీ పొరబాటు చేయటం మంచి పనేనా?" నాకూ కొంచెం రోషం లాంటిది కల్గింది. ఛ్రుమని తలెత్తి చూశాను.

"మీరన్నదంతా నిజమేనని ఒప్పుకుందాం. కాని మీరు చేసిన పనులుమాత్రం బాగున్నాయా మహా? లేనిపోని అతి చనువు ప్రదర్శించలేదూ ?" నా మాటల కతను నవ్వాడు. "నిజమే అదే నేనూ అనబోతున్నాను. మొదట నే ననుకున్నది వేరు. కొన్నాళ్ళు చూసిన తరువాత నచ్చితే పెండ్లి చేసుకోవటం, నచ్చకుంటే మర్యాదగా సాగనంపటం నా మొదటి ఆలోచన. కాని రంగంలోకి దిగిం తరువాత కాస్త ఓవర్ యాక్ట్ అయిం దనుకుంటాను. పెద్దవాండ్లన్నదే రైటు. మన దేశానికీ డేటింగ్ పద్ధతి పనికిరాదులా వుందికదూ?" నేనతని ప్రశ్నకు అతని మొహంలోకి చూశాను. అతని కనులు అల్లరిగా నవ్వుతున్నాయి. నాకు చచ్చే సిగ్గు వేసింది. అతను మళ్ళీ మొదలు పెట్టాడు. "కొన్నాళ్ళు నీ స్వభావం పరిశీలించి నీవేదైనా హద్దు మీరేటట్టుంటే బుద్ధి చెప్పాలనుకున్నానా? నిన్ను చూసేకొద్దీ నాకే బుద్ధి వెర్రితలలు వేసింది. నేనే హద్దుమీరబోయినాను...." "అప్పుడు బుద్ధి నేనే చెప్పానుగా?" మాధవరావు మొహం ఎర్రగా అయింది. అతను గంభీరంగా అన్నాడు. "నీవు మరీ రాక్షసివి. నేనేదో కాస్త పొరబాటుపడ్డానే అనుకో, కాదంటేపోలా? మరీ చెంపవాయగొడతావా? కాబోయే మొగుడు వీడన్న గౌరవమేమైనా వుందీనీకు? ఏదన్నా అంటే వెనకాముందూ చూడకుండా తన్నటమేనా ఏం?"

"మీరు కాబోయే మొగుడని కలరాలేదు మరి. ఏకాస్త వూహించినా అంత దెబ్బ వెయ్యను సుమా అంతేగాక అసలు...." అంటూ సగంలో ఆగిన నన్ను చూసి కుతూహలంగా అతను "ఏమిటదీ?" అన్నాడు. నేను తల ఎత్తి అతనివైపు చూశానొకక్షణం. వెన్నెల పుచ్చపువ్వులా వున్నది. చల్లగాలి కతని వుంగరాల జుట్టు ఒయ్యారంగా కదుల్తున్నది. అతని తెల్లని చేతికి వున్న కెంపుల వుంగరం నిప్పులాగా మెరుస్తున్నది. చూసిన మొదటి క్షణం నుంచీ అతని రూపం నన్నాకర్షించిందనీ. నా మనసంతా అతనితోనే నిండి వున్నదనీ. కాని అతడు వివాహితుడూ, నాకందనివాడూ అని తెల్సిన తరువాత, పక్కవాడి చేతిలోని బొమ్మ తన నాకర్షించి అది తనకు లభ్యంకాదని తెలిసి వాడితో ఏదో గిల్లికజ్జా, పెట్టుకుని తిట్టో కొట్టో తృప్తి పొందుదామనే పసివాడి మనస్తత్వం నాలో ఆ క్షణాన వుందనీ, అందుకే అతడు చేసిన పొరబాటుకు అంత దెబ్బకొట్టాననీ అతనికెట్లా చెప్పను? ఏమని చెప్పను? అందువల్లనే చివాల్న లేచి నుంచొని తెల్లబోయి చూస్తున్న అతనితో "ఇప్పుడు చెప్పలేను. మరొకసారి" అంటూనే గిర్రున వెనుదిరిగాను. అది ముందే గ్రహించినవాడిలాగా అతను చెయ్యి జాపి గభాల్న పట్టుకున్నాడు నన్ను. తిరగటంలో నా జడ అతని చేతికి దొరికింది. "అబ్బా!" అన్నానేన్ను నిలబడిపోతూ. అతను నా జడ చేతికి చుట్టుకుంటూ నవ్వాడు.

"ఇంతసేపూ నన్నింత వాగించి అవునూ, కాదూ చెప్పకుండానే పరిగెత్తుతే వూరుకుంటాననుకున్నావా? అదేమిటో చెప్పి కదలాల్సిందే" నన్నాడు. నేను సిగ్గుతో కందిపోయిన మొహంతో అతనివైపు చూడకుండానే మెల్లగా "చెప్పను నాకేం అభ్యంతరంలేదు కాని. మీరిందాకనే అన్నారుగా నన్ను రాక్షసని, మరి ఇప్పుడు మళ్ళీ...." అన్నాను. "అమ్మబాబోయ్ మళ్ళీ చెంప వాయగొడ్తావా ఏం ఖర్మ" భయపడ్డట్టు నటిస్తూ అతను చెంప పట్టుకున్నాడు. సందు దొరకగానే నేను జడలాక్కుని పరిగెత్తాను. పదడుగులు వేసి తిరిగి చూసి "చేత్తో కాదులెండి. భయపడనవసరంలేదు" అన్నానేన్ను చిలిపిగా. అతను నవ్వుతూ రెట్టించాడు "దేంతో మరి?" నేను అతనివైపొకసారి చూసి నవ్వి, నా తలలో స్వర్ణలత సాయంకాలం తురిమిన పెద్ద జాజిపూల దండ తీశాను. అరవిచ్చుతున్న సన్నజాజులు కమ్మని వాసన వెదజల్లుతున్నాయి. దోసిట్లో వుంచుకుని, ఒక్కసారి వాసన చూసి అతనిమీద విసిరివేశా నా జాజిపూల దండ. అతను రెండు చేతులతో అది అందుకుని నవ్వుతూ నన్ను చూసి "మళ్ళీ విసరనా?" అన్నాడు చిలిపిగా. నేను ఎర్రబడ్డ మొహంతో "ఇప్పుడు కాదులెండి" అంటూ అతని సమాధానంకోసం చూడకుండనే ఇంట్లోకి పరుగెత్తాను.

(అయిపోయింది)